క్లుప్తంగా

వివక్ష లేని సమాజ స్థాపనే లక్ష్యం : జడ్జి దుర్గాకల్యాణి



నూజివీడు: చట్టపరంగా ఎలాంటి వివక్ష, తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమ న్యాయం చేయాలన్నదే సామాజిక న్యాయ దినోత్సవం ముఖ్యోద్దేశమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.దుర్గాకల్యాణి అన్నారు. నూజివీడు మండలం యనమదల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయవాది నందూరి పద్మాంజలి, హైస్కూల్ హెచ్‌ఎం జి.విజయ కుమారి పాల్గొన్నారు.

భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఊరేగింపు

కొండపర్వ(విస్సన్నపేట): మండలంలోని కొండపర్వ గ్రామంలో ఉన్న భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఊరేగింపు మహోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ గొట్టిపూళ్ల రామకృష్ణ రంగారావు నివాసం వద్ద నుంచి స్వామి వారి ఊరేగింపు మొదలై గ్రామంలో పురవీధుల గుండా సాగింది. దేవస్థానం చైర్మన్ గొట్టిపూళ్ల బుచ్చి వెంకట్రామ లక్ష్మీనరసింహారావు, గ్రామ సర్పంచ్ గొట్టిపూళ్ల రమేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు జి.చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

విజయవంతంగా టెన్త్ క్లాస్ మోడల్ పరీక్ష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):ఎస్‌ఎఫ్‌ఐ,యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు సోమవారం నిర్వహించిన మోడల్ పరీక్ష విజయవంతంగా ముగిసింది. జెడ్పీ బాలికల పాఠశాల, క్రాంతి హైస్కూల్ విద్యార్థులు పరీక్షలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. వివిధ మండలాల్లో నిర్వహించిన మోడల్ పరీక్షలో సుమారు 7వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరావు తెలిపారు.

నేడు తిరువూరు మండల పరిషత్ సమావేశం

తిరువూరు: తిరువూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దల భారతి అధ్యక్షతన జరిగే సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు గృహసారథుల సమావేశం

ఆగిరిపల్లి: స్థానిక నూజివీడు రోడ్డులోని పొన్నం విజయ కన్వెన్షన్‌లో మంగళవారం గ్రామ వలంటీర్లకు, గ్రామ సచివాలయ రథ సారథులు, గృహసారథులతో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమావేశమవుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు తెలిపారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

ఆగిరిపల్లి: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సహకరించాలని ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఆగిరిపల్లి-2 ఎంపీటీసీ సభ్యుడు సొదం గోపీనాథ్ మాట్లాడుతూ ఆగిరిపల్లి ఎస్సీవాడలో ముగ్గురు ఓటీఎస్ లబ్ధిదారులకు ఇంతవరకు పట్టాలు ఇవ్వలేదని చెప్పడంతో దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కొండవరదల రమేష్, తహసీల్దార్ ఉదయ్ భాస్కరరావు, పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ అత్తి పార్వతి, ఎంపీడీఓ కె.వాణి, హౌసింగ్ ఏఈ అలీ ముల్లా, ఏఓ చెన్నారావు పాల్గొన్నారు.

పాఠశాల తలుపులు పగలగొట్టిన ఆకతాయిలు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మండలంలోని మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిలు తొమ్మిదవ తరగతి గది తలుపు, కిటికీలు పగలగొట్టారు. పాఠశాలకు శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో ఆకతాయిలు పాఠశాలలో చొరబడి బీభత్సం సృష్టించారు. సోమవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పగిలిన డోర్లు, కిటికీలు చూసి హెచ్‌ఎంకు సమాచారం ఇచ్చారు. పాఠశాలకు వచ్చిన హెచ్‌ఎం ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ రాయనపాడు ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నల్లకుంట, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

వ్యర్థాలతో ప్రజలు రోగాలపాలు

- తొమ్మండ్ర వాగులోకి రసాయనిక వ్యర్థాలు
- ప్రాణాలు కోల్పోతున్న మూగజీవాలు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు

జి.కొండూరు: కొండపల్లి ఐడీఏలోని పలు రసాయనిక పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వ్యర్థాలు కలిసిన నీరు తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. వీటి నుంచి వచ్చే దుర్వాసనతో మెదడు సంబంధిత వ్యాధులు, అలర్జీలతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. దశాబ్దాలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తీరు మార్చుకోని పరిశ్రమలు

కొండపల్లి ఐడీఏలోని పలు రసాయనిక పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను ఆయా పరిశ్రమలు పక్కనే ఉన్న తొమ్మండ్ర వాగులోకి విడుదల చేస్తున్నారు. ఈ వాగు కట్టుబడిపాలెం గ్రామంలో నుంచి ప్రవహిస్తుండడంతో వాగులో నీరు తాగి పలుమార్లు పశువులు, మేకలు, పందులు మృత్యువాత పడ్డాయి. ఇటీవల ఈ వాగులో నీరు తాగి పది పందులు మృత్యువాత పడ్డాయి. వాగు నుంచి వచ్చే దుర్వాసనతో మెదడు సంబంధిత అలర్జీలు తదితర వ్యాధుల బారిన పడుతున్నామని కట్టుబడిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కట్టుబడిపాలెం గ్రామంలో రసాయనిక వ్యర్థాలు కలుస్తున్న తొమ్మండ్ర వాగు

వ్యవసాయ భూమిపై కూడా ప్రభావం:

వర్షాలు పడుతున్న సమయంలో వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు ఈ వాగులోకి వ్యర్థాలు కలవడం వల్లన కట్టుబడిపాలెం, కవులూరు గ్రామాలకు చెందిన వందల ఎకరాలపై ప్రభావం చూపుతోంది. వాగు నీటిలో రసాయనిక వ్యర్థాలు కలవడంతో ఈ రసాయనాలు వ్యవసాయ భూమిలోకి చేరి పంటలు పండక చవుడు భూములుగా మారిపోతున్నాయి. ఈ సమస్యపై గతంలో రైతులు నిరసన వ్యక్తం చేయగా, పరిశ్రమల యాజమాన్యాలు కొంతకాలం పాటు వాగులోకి రసాయనిక వ్యర్థాలను విడుదల చేయడం నిలిపివేశారు. అయితే తర్వాత మళ్లీ షరా మామూలే. వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్ ఉన్నప్పటికీ వ్యర్థాలను తరలించడం ఖర్చుతో కూడుకున్న నేపథ్యంలో పరిశ్రమల యాజమాన్యాలు వాటిని వాగులోకి విడుదల చేసేసి చేతులు దులుపుకొంటున్నాయి. దీనిపై పలుమార్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు విచారణ జరిపినప్పటికీ సదరు పరిశ్రమలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వలనే వారు తమ తీరును మార్చుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తక్షణం సమస్య పరిష్కరించాలి



ఐడీఏలోని కెమికల్ కంపెనీల నుంచి వ్యర్థాలను తొమ్మండ్ర వాగులోకి వదులుతున్నారు. ఈ నీరు తాగి ఇటీవల పది పందులు మృతి చెందాయి. వాగు నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నాం.అప్పుడప్పుడు వ్యర్థాలను మండించి గాలిలోకి వదులుతున్నారు. దీనివలన విడుదలయ్యే కాలుష్యంతో తీవ్రమైన తలనొప్పితో రోగాలపాలవుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–దారావత్ సాయి, కట్టుబడిపాలెం

రూ.35 కోట్లతో ఇంటింటికీ కుళాయి

ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ.కొండూరు: కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో రూ.35కోట్లతో ఇంటింటికీ కుళాయిల ద్వారా కృష్ణాజలాలు సరఫరా చేయించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.5 కోట్లతో వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి కృష్ణా జలాలు సరఫరా చేయిస్తున్నామని, కొన్ని గ్రామాల్లో ఆర్వోప్లాంట్ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తిరువూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నామని, మండలంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తామన్నారు. డయాలసిస్ రోగులకు ప్రతినెలా రూ.10వేలు పింఛను, ఉచిత మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి పథకాలు మంజూరు చేయిస్తూ ప్రజల వద్దకే పాలన చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధి కోసం సీసీ రహదారులు, తాగునీరు, విద్యుత్ పలు రకాల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి తండాకు అభివృద్ధి నిమిత్తం ఎమ్మెల్యే నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో నివేశన స్థలాలు ఉన్న వారికి కాలనీ గృహాలు మంజూరు చేయించటానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మండలాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్య గనియా, వైస్ ఎంపీపీలు జి.శివారెడ్డి, ఎస్.పద్మ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు ఎ.వెంకటరెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, జి.వెంకట్రావు, సర్పంచ్ వి.రజని, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు టి.సురేష్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సురేష్

రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించనున్నట్లు మాస్టర్ ట్రైనర్ సీహెచ్ రాణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పీఎండీఎస్‌పై రైతులకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. పీఎండీఎస్ చేయడం వల్ల భూమి సారవంతం అవుతుందని మండల వ్యవసాయాధికారి సురేష్ వెల్లడించారు. సూర్యరశ్మి నేరుగా భూమిపై పడటం వల్ల భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు చనిపోతాయని, నవ ధాన్యాలతో పాటు పలు రకాల విత్తనాలు వేసి భూమిని కప్పి ఉంచటం ద్వారా భూమిలోని సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, పీఆర్పీ ఏసమ్మ, ఐసీఆర్‌పీలు, ఐబీ వాలంటీర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన డీవైఈవో



డీవైఈవోను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

రెడ్డిగూడెం: పదవ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని నందిగామ డివిజన్ డీవైఈవో గౌరి శంకర్ అన్నారు. మండలంలోని నాగులూరు హైస్కూలును మధ్యాహ్న భోజన పథకాన్ని సోమవారం ఆకస్మిక తనిఖీ చేసి పదవ తరగతి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం రెడ్డిగూడెం మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో గౌరీశంకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా జి. అనుగ్రహప్రసాద్, మండల అధ్యక్షుడు బి.అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గంపలగూడెం స్పందనలో ఐదు అర్జీలు

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఐదు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. పక్క పొలంలో జామాయిల్ తోట వేయడం వలన తన పొలంలో నీళ్లు నిలువ ఉండట్లేదని, ఈ కారణంగా పంటలు పండక తీవ్రంగా నష్టపోతున్నానంటూ వినగడపకు చెందిన ఊటుకూరు శ్రీనివాసరావు ఫిర్యాదు ఇచ్చారు. తన స్థలంలో కట్టుకున్న ఇంటిని పక్క ఇంటివారు కూల్చివేశారని, తగిన చర్యలు తీసుకోవాలని పెనుగొలనుకు చెందిన ఎండపల్లి రత్నాకర్ ఫిర్యాదు చేశారు. రుణం మొత్తం చెల్లించినా కూడా కుదవ పెట్టిన బంగారం బ్యాంకు వారు ఇవ్వడం లేదంటూ గంపలగూడెంకు చెందిన మేరుగు సుజాత ఫిర్యాదు చేశారు. ఊటుకూరుకు చెందిన షేక్ అమితా బేగం తన పొలం ఆన్‌లైన్‌లో ఎక్కించాలని అర్జీ అందించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు రావలసిన నగదు వెంటనే ఇప్పించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో దరఖాస్తు ఇచ్చారు. డెప్యూటీ తహసీల్దార్ ఎల్.రాధికారాణి, ఎంఈఓ సోమశేఖర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

తిరువూరులో...

తిరువూరు: నగర పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది.తిరువూరు రాజుపేట ముత్యాలమ్మ గుడి ఏరియాలో సీసీ రహదారి నిర్మించాలని బీజేపీ నాయకులు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రైతులకు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన బిల్లులు త్వరగా మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు మరసకట్ల ప్రభాకరరావు, సాంబారు వెంకటేశ్వర్లు వినతిపత్రం సమర్పించారు. రెవెన్యూ సంబంధ సమస్యలపై మరో రెండు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

సబ్ కలెక్టర్ స్పందనలో 12 అర్జీలు

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 12 అర్జీలు వచ్చాయి. కార్యాలయ ఏఓ రంగారావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. డివిజన్‌లోని నూజివీడు, లింగపాలెం, చింతలపూడి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల నుంచి ప్రజలు రెవెన్యూ, రహదారుల ఆక్రమణలు, విద్యాశాఖ తదితర సమస్యలపై అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పుట్రేల సచివాలయం-1 పరిధిలో రూ.15.51 కోట్ల లబ్ధి

ఎమ్మెల్యే రక్షణనిధి

పుట్రేల (విస్సన్నపేట): పుట్రేల సచివాలయం -1 పరిధిలో 6,331 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద రూ.15.51 కోట్లు అందజేసినట్టు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి వివరించారు. మండలంలోని పుట్రేల గ్రామసచివాలయం -1 పరిధిలో వీరరాఘవాపురం, పుట్రేల గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో కోటి రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంతవరకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఆయా లబ్ధిదారుడికి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే వివరిస్తూ సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, గ్రామ సర్పంచ్ కారుమంచి స్వాతి, మాజీ ఉపసర్పంచ్ భీమిరెడ్డి పట్టాభిరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ భూక్యా రాణి, గృహ సారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, మారెమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌బాబు, గ్రామ ప్రముఖులు బొల్లారెడ్డి సత్యనారాయణరెడ్డి, మద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ లింగాల వెంకటరత్నం, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు పుట్రేల-2 సచివాలయం పరిధిలో...

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం -2 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ సోమవారం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరిస్తారన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులంతా పని చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండల కేంద్రం ముసునూరులో పార్టీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన సోమవారం గృహ సారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వలంటీర్లు గృహ సారథులు సమన్వయంతో ప్రజలకు మంజూరైన వివిధ పథకాలను వారి ఇళ్లకే వెళ్లి వివరించాలని సూచించారు. తమ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా ప్రతి పథకంతో లక్షలాది మంది పేదలకు నేరుగా ప్రయోజనం కలిగిస్తున్న విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని గుర్తించి, జగనన్నను మళ్లీ సీఎంను చేయడానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాజానాయన, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, గృహ సారథుల నియోజక వర్గ నేత గుడిమళ్ల రామస్వామి, నూజివీడు సచివాలయ కన్వీనర్ పిల్లా చరణ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వ్యవసాయ సొసైటీల అధ్యక్షులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.



ముసునూరులో గృహ సారథుల అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

వసతి గృహాన్ని సందర్శించిన న్యాయమూర్తి

మైలవరం: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత హాస్టల్ వెల్ఫేర్ అధికారులదేనని జడ్జి షేక్ షిరీన్ తెలిపారు. మైలవరంలోని డీఎస్‌టీ బాలుర వసతి గృహాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ జడ్జి షేక్ షిరీన్ సోమవారం సందర్శించారు. విద్యార్థుల నుంచి మెనూ, వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో న్యాయవాది బుద్దారపు వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్జి షిరీన్ మాట్లాడుతూ భోజనం రుచిగా, శుచిగా ఉండాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ హనుమానాయక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మైలవరం డీఎస్‌టీ హాస్టల్‌లో భోజన పదార్థాలు పరిశీలిస్తున్న జడ్జి షేక్ షిరీన్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గంపలగూడెం: మండలంలో మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఇంజినీర్ కొమ్ము వాసు తెలిపారు. ఎ.కొండూరు నుంచి గంపలగూడెం వరకు 33 కేవీ ప్రధాన లైన్ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బలివేలో వైభవంగా రథోత్సవం

బలివే(ముసునూరు):భక్తుల అమావాస్య స్నానాలు, స్వామి వారి రథోత్సవం, పవళింపు సేవతో బలివేలోని రామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిసినట్టు ఉత్సవాల అధికారి నాగసురేష్, ఈఓటి.విశ్వేశ్వరరావు తెలిపారు. బలివే తీర్థ క్షేత్రానికి ఆది, సోమవారాల్లో వేలాదిగా భక్తులు తరలివచ్చి, తమ్మిలేరు లోనూ, జల్లు స్నానాల వద్ద అమావాస్య స్నానాలాచరిస్తూ, స్వామిని దర్శించుకున్నారు. తమ పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేశారు. ఆదివారం రాత్రి స్వామి వారికి బలివే గ్రామ వీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సీఐ ఆర్.అంకబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎం.కుటుంబరావు బందోబస్తు నిర్వహించారు. సోమవారం ఉదయం బిందె తీర్థం, బలిహరణ, వసంతోత్సవం, అవభృతం, సాయంత్రం హోమం, బలిహరణాదులు, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ చేసి, బలే రామ లింగేశ్వర స్వామి వారికి భక్తి శ్రద్ధలతో సంప్రదాయ సిద్ధంగా, పవళింపు సేవ చేశారు. కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ దంపతులు, మండల పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ కాందూరి శ్రీరామచంద్ర, ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, పెద్దలు చెన్నయ్య, చిట్టిబొమ్మ సూరిబాబు, నాయుడు సత్యనారాయణ, రాము, భక్తులు హాజరయ్యారు.



బలివే వీధుల్లో బలే రామలింగేశ్వరుని రథోత్సవం

నేడు హుండీ కానుకల ఆదాయం లెక్కింపు

మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి హుండీల ద్వారా లభించిన ఆదాయం మంగళవారం లెక్కించనున్నట్లు ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు తెలిపారు.

ఏఐ ద్వారా సంక్లిష్ట సమస్యలకు సైతం సమాధానాలు

మైలవరం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా ఎంతో సంక్లిష్టమైన సమస్యలకు సైతం సునాయాసంగా సమాధానాలు రాబట్టవచ్చునని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్, డీన్ డాక్టర్ ఈదర శ్రీనివాసరెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈఈఈ(ఎస్‌బీ) విభాగం ఆధ్వర్యంలో డీప్ లెర్నింగ్ అనే అంశంపై సోమవారం వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మైక్రోసాఫ్ట్ పవర్ పాయింట్ ద్వారా డీప్ లెర్నింగ్ ఆర్కిటెక్చర్ అండ్ సీఎన్ఎస్ అనే అంశం, అత్యాధునిక డీప్ లెర్నింగ్‌పై చర్చించారు. ఈ అంశం ప్రధానంగా ఆరోగ్య సంబంధిత సమస్యల్లో పేషెంట్‌కి సంక్లిష్ట ఆపరేషన్ చేసే సమయాల్లో వివిధ పరికరాల ద్వారా ఉపయోగిస్తారని తెలిపారు. ఈ అంశంలో ప్రావీణ్యం సాధిస్తే అత్యున్నత ఉద్యోగాలు లభి స్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, ఏఐ అండ్ డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.వీరయ్య, ఐఈఈఈ సీనియర్ మెంబర్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

మోస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మైలవరం: మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్టు(మోస్ట్) ఆధ్వర్యంలో స్థానిక నూజివీడు రోడ్డులోని చలువాది మల్లికార్జునరావు ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 26న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరుగుతుందని, ప్రముఖ వైద్యులు జనరల్ మెడిసిన్, అప్తమాలజీ, క్యాన్సర్, న్యూరాలజీ, పల్మనాలజీ, పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, యూరా లజీ, ఆర్థోపెడిక్స్, దంత వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మైలవరం మండల ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

వీఓఏగా బద్రి అంజలి గెలుపు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కొత్తూరు తాడేపల్లి ఇందిరాగాంధీ గ్రామైఖ్య సంఘం సహాయకురాలు(వీఓఏ) ఎన్నికలో బద్రి అంజలి భారీ మెజార్టీతో గెలుపొందింది. ఇందిరాగాంధీ గ్రామైఖ్య సంఘంలో 30 డ్వాక్రా గ్రూపులున్నాయి. సభ్యుల సమక్షంలో ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికలో బద్రి అంజలికి 20 ఓట్లు రాగా, ప్రత్యర్థి బద్రి జకీరకు కేవలం 5 ఓట్లు మాత్రమే వచ్చాయి. వీఓఏ ఎన్నికలో అంజలి గెలుపొందినట్టు జిల్లా సమాఖ్య ప్రతినిధులు కె.రాణి, లియోన ప్రకటించారు. ఏపీడీ కిరణ్ కుమార్, ఐబీ డీపీఎం సునీత లక్ష్మి, ఫైనాన్స్ డీపీఎం శోభన్‌బాబు,ఏపీఎం చంద్రశేఖర్, సీసీ రామారావు, సీఆర్పీ లక్ష్మితులసి పాల్గొన్నారు.

త్రిపురాంతకేశ్వర ఆలయంలో అన్నదానం

ఇబ్రహీంపట్నం: ఫెర్రీ లోని శ్రీబాల త్రిపురసుందరి సమేత శ్రీత్రిపురాంతకేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో మహాశివరాత్రి పండగ పురస్కరించుకుని మూడోరోజు సోమ వారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు మునగాల సాంబశివారెడ్డి పార్టీ నాయకులతో కలసి ప్రారంభించారు.

ప్రభుత్వ పథకాలపై ఇంటింటా ప్రచారం

ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: ప్రభుత్వ పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. చాట్రాయి మండలం బూరుగుగూడెం గ్రామంలో సోమవారం మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో గృహసారథులు, గ్రామ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలతో దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తుందని అన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తోన్న పథకాలను లబ్ధిదారులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, మండల సచివాలయాల కన్వీనర్ పుచ్చకాయల సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చల్లగుళ్ల జగన్‌మోహనరావు, బూరుగుగూడెం, చాట్రాయి గ్రామాల సర్పంచ్‌లు దేశిరెడ్డి హైమావతి, దామెర ఉష, జిల్లా వైఎస్సార్ వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పల్లె రవీంద్రరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ, మండల పార్టీ నాయకులు చెలికాని బాబ్జి, కారంగుల వాసు, పరసా చెన్నారావు, మాదల నర్సింహారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



బూరుగుగూడెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు